# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 11-03-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **రాజధాని అమరావతి నిర్మాణం పూర్తి చేస్తామని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ స్పష్టం చేశారు.**

2. **కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రవ్యాప్తంగా 125 ఆటిజం సెంటర్లను ఏర్పాటు చేస్తామని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు.**

3. **కార్మికుల భద్రతకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు.**

4. **శాసనసభ్యుల కోటాలో శాసనమండలికి దాఖలైన ఐదు నామినేషన్లను అధికారులు ఆమోదించారు.**

5. **కర్నూలు జిల్లాలో ఈ రోజు జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి చెందారు.**

==========================

రాజధాని అమరావతి నిర్మాణం 3 సంవత్సరాల్లో పూర్తి చేస్తామని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ స్పష్టం చేశారు. శాసనసభ సమావేశాల్లో భారతీయ జనతా పార్టీ సభ్యులు వై.సుజనా చౌదరి అమరావతి నిర్మాణంపై అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. అమరావతి పనులు పూర్తి చేసేందుకు 64వేల 721 కోట్ల రూపాయలతో అంచనా రూపొందించామని.. టెండర్ల ప్రక్రియ కొనసాగుతోందని వివరించారు. ప్రధాన రహదారులు, భవనాల నిర్మాణం ప్రణాళికాబద్ధంగా పూర్తి చేస్తున్నామని మంత్రి నారాయణ వివరిస్తూ...

వాయిస్ ( 34 సెకన్స్)

-------------------------

రాష్ట్రంలోని పాఠశాలలకు వాటి మౌలిక వసతులు, నిర్మాణం ఆధారంగా రేటింగ్ ఇస్తున్నామని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. శాసనసభ బడ్జెట్ సమావేశాల సందర్భంగా సభ్యుల ప్రశ్నలకు ఆయన సమాధానమిస్తూ.. ప్రభుత్వ పాఠశాలలను ఫైవ్ స్టార్ రేటింగ్ స్థాయికి తీర్చిదిద్దేందుకు 13 వేల 600 కోట్ల రూపాయల వ్యయం అవుతుందని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్ర వ్యాప్తంగా 125 ఆటిజం సెంటర్లను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఆటిజంతో ఉన్న విద్యార్థులకు ఉపాధ్యాయులు ఎలా ఉండాలి, స్కూళ్లలో మౌలిక సదుపాయాలు ఎలా ఉండాలనే అంశంపై శాసనసభ్యులతో కమిటీని ఏర్పాటు చేస్తామని మంత్రి లోకేష్ వెల్లడించారు. ప్రత్యేక అవసరాల పిల్లల కోసం 679 భవిత సెంటర్లు నిర్వహిస్తున్నామని, ప్రతి సెంటర్‌కు ఇద్దరు చొప్పున వెయ్యి 358 ఐఈఆర్‌పీలు ఉన్నారని వెల్లడించారు.

-------------------------

కార్మికుల భద్రతకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. విజయవాడలో 54 వ జాతీయ భద్రతా వారోత్సవాల ముగింపు సందర్భంగా భారీ ర్యాలీని ఆయన ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పరిశ్రమలకు ప్రభుత్వం అన్ని విధాల సహకరిస్తుందని తెలిపారు. కార్మికుల భద్రత పట్ల యాజమాన్యాలు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు ముఖ్యమంత్రి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారని, కార్మికుల భద్రత, సంక్షేమం, ఆరోగ్యం పట్ల ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారిస్తోందని మంత్రి సుభాష్ వివరిస్తూ...

వాయిస్ ( 35 సెకన్స్)

---------------------------

ఉద్యోగులు, కార్మికులు భద్రతా నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీ శ సూచించారు. జాతీయ భద్రతా వారోత్సవాల సందర్భంగా ఈ రోజు ఆయన విజయవాడలో పాత్రికేయులతో మాట్లాడుతూ ఎన్టీఆర్ జిల్లాలో కార్మికుల భద్రత కోసం పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. భద్రతా ప్రమాణాలు పాటించినప్పుడే ప్రమాదాలను నివారించగలమని లక్ష్మీశ తెలియజేశారు.

---------------------------

ప్రణాళికశాఖ ఆధ్వర్యంలో అమరావతిలోని ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయంలో 'పాపులేషన్ డైనమిక్స్ అండ్ డెవలప్‌మెంట్' అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నారు. ఈ రోజు సాయంకాలం 4 గంటలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారు. జాతీయ, అంతర్జాతీయ నిపుణులు ఈ సదస్సులో పాల్గొని జనాభా నిర్వహణకు సంబంధించిన అంశాలపై చర్చిస్తున్నారు.

---------------------------

రాష్ట్ర మంత్రివర్గ ప్రత్యేక సమావేశం ఈ నెల 17వ తేదీన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరగనుంది. శాసనసభలో ప్రవేశపెట్టనున్న పలు బిల్లులపై మంత్రివర్గం చర్చించి ఆమోదం తెలుపుతుంది. ఈ నేపథ్యంలో ముసాయిదా బిల్లుల ప్రతుల్ని, ప్రతిపాదనల్ని ఆయా ప్రభుత్వ శాఖలు ఈ నెల 13వ తేదీ మధ్యాహ్నం 2 గంటల్లోగా సాధారణ పరిపాలన శాఖకు పంపించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు.

---------------------------

శాసనసభ్యుల కోటాలో శాసనమండలికి దాఖలైన ఐదుగురు అభ్యర్థుల నామినేషన్లకు అధికారులు ఆమోదం తెలిపారు. ఎమ్మెల్సీ అభ్యర్థులుగా తెలుగుదేశం పార్టీ తరపున కావలి గ్రీష్మ, బీటీ నాయుడు. బీద రవిచంద్ర... జనసేన పార్టీ నుంచి కొణిదెల నాగేంద్రబాబు, భారతీయ జనతా పార్టీ తరపున సోము వీర్రాజు నామినేషన్లు దాఖలు చేశారు.

---------------------------

కర్నూలు జిల్లాలో ఈ రోజు జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి చెందారు. ఆదోని మండలం పాండవగల్లు వద్ద కర్ణాటక రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బస్సు అదుపుతప్పి రెండు మోటార్ సైకిళ్లను ఢీకొట్టింది. ఈ ఘటనలో నలుగురు మృతి చెందగా, మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని సహాయ చర్యలు చేపట్టారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

షెడ్యూల్ కులాల వర్గీకరణపై రాజీవ్‌నందన్ మిశ్రా కమిషన్ రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికను సమర్పించింది. ఈ రోజు సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్‌కు నివేదికను అందజేసింది. ఎస్సీ వర్గీకరణలో భాగంగా రిజర్వేషన్ విధానంపై కమిషన్ అధ్యయనం చేసింది. ఎస్సీ ఉపవర్గాల్లో ఆర్థిక స్వావలంబనపై ఏకసభ్య కమిషన్ అధ్యయనం చేపట్టి.. విజ్ఞప్తులు, అభ్యర్థనలు సేకరించింది.

---------------------------

రాష్ట్రంలో ఎండల తీవ్రత పెరుగుతోంది. ఈ రోజు అల్లూరి సీతారామరాజు జిల్లాలోని కూనవరం, వరరామచంద్రాపురం, ఏలూరు జిల్లాలోని వేలేరుపాడు, పార్వతీపురం మన్యం జిల్లాలోని పాలకొండ, సీతంపేట, శ్రీకాకుళం జిల్లాలోని బూర్జ, హిరమండలం, లక్ష్మీనర్సుపేట మండలాల్లో తీవ్ర వడగాల్పులు వీచే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. శ్రీకాకుళం జిల్లాలో 11 మండలాలు, విజయనగరం జిల్లాలో 16, పార్వతీపురం మన్యం జిల్లాలో 10, అనకాపల్లి జిల్లాలో 2, కాకినాడ జిల్లాలో 1, కోనసీమ జిల్లాలో 1, తూర్పుగోదావరి జిల్లాలో 8, ఏలూరు జిల్లాలోని 3 మండలాల్లో వడగాల్పుల ప్రభావం ఉంటుందని వెల్లడించింది.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 120వ సంచిక ఈ నెల 30వ  తేదీ ఆదివారం ప్రసారం అవుతుంది."మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 28వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

---------------------------

తిరుమల తిరుపతి దేవస్థానం ఆస్థాన విద్వాంసులు గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ అంత్యక్రియలు ముగిశాయి. తిరుపతి భవానీనగర్‌లోని ఆయన నివాసం నుంచి లీలామహల్ సర్కిల్ వరకు అంతిమయాత్ర జరిగింది. హరిశ్చంద్ర స్మశానవాటికలో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు అంత్యక్రియలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా తిరుపతి ఆర్డీఓ రామ్మోహన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాలతో ప్రభుత్వ లాంఛనాలతో గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ అంత్యక్రియలు నిర్వహించామని తెలిపారు. ఆయన కుటుంబ సభ్యుల కోరిక మేరకు తిరుపతి నగరంలో గరిమెళ్ల విగ్రహం ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తామని చెప్పారు.

=====================